క్లుప్తంగా

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న చిన్నారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొనుగోలు చేసిన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను ఒకరినొకరు కట్టుకుని స్నేహితుల దినోత్సవం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మరికొంతమంది కేక్‌లు కట్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశాలు పంపించుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పేదింట వివాహానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ సభ్యులు

విజయనగరం: ఓ పేదింట యువతి వివాహానికి జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ చేయూతనందించింది. నగరంలోని జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ కార్యాలయంలో పెళ్లికూతురు తల్లికి రూ.35 వేలు, శతమానం, కాసు, కాళ్లు కడిగే సామాగ్రి, పట్టుచీర, పెళ్లిబట్టలు, సారె ఆదివారం అందజేశారు. అనంతరం ఆ సంఘ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ దివ్యాంగుడైన సుగ్గు జగన్నాథం .. తన కుమార్తె పావని వివాహం కోసం ఆర్థికసాయం చేయాలని కోరగా వెంటనే స్పందించి, సాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజు, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి ఉద్యోగోన్నతి

విజయనగరం ఫోర్ట్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏడుగురు సూపర్‌వైజర్లకు సీడీపీవోలుగా ఉద్యోగోన్నతి లభించింది. విజయనగరం ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.విద్యకు శ్రీకాకుళం జిల్లా టెక్కలి పీవోగా, రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న రజినీదుర్గకు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం..కు, సీహెచ్ సన్యాసమ్మకు కృష్ణా జిల్లా, పామర్రుకు, భోగాపురం ప్రాజెక్టులో పనిచేస్తున్న జె.రేఖావాణికి పార్వతీపురం మన్యం జిల్లాకు, మంగమ్మను సాలూరు ప్రాజెక్టుకు, విజయనగరం అర్బన్ ప్రాజెక్టులో పనిచేస్తున్న జి.ఎర్రయ్యమ్మకు అనకాపల్లి జిల్లా, వడ్డాది మాడుగులకు, గంట్యాడ ప్రాజెక్టులో పనిచేస్తున్న గౌరమ్మకు తూర్పుగోదావరి జిల్లా, రాజానగరానికి నియమించారు.

ప్రతిభా విద్యార్థులకు స్నేహహస్తం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న స్నేహహస్తం సొసైటీ సభ్యులు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలో గల బెల్లానా ఫంక్షన్ హాల్‌లో 2024 – 25 సంవత్సరంలో గజపతినగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్నేహహస్తం సొసైటీ సభ్యులు ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థులు జి.కిశోర్, పి.సాత్విక్, బి. త్రినాథ్, జి.లిఖిత, పి. ప్రశాంతి, జి.దేవీలకు నగదు పంపిణీ చేశారు. అనంతరం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

శ్రమదానం



శుభ్రం చేసిన పీహెచ్‌సీ రహదారి

గజపతినగరం: మండలంలోని మరుపల్లి పీహెచ్‌సీకి వెళ్లే రహదారిలో మరుపల్లి యువత ఆదివారం శ్రమదానం చేపట్టారు. జేసీబీతో రోడ్డుకిరువైపులా చెత్తను తొలగించి, మొక్కలు నాటారు. శ్రమదానం చేసిన యువతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గెద్ద కృష్ణారావు, లెంక గోపీనాథ్, గెద్ద సతీష్ కుమార్, లచ్చిరెడ్డి రాజు, గెద్ద సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన అంబల్ల రామకృష్ణకు విశాఖ నార్త్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముజీజ్ ఖాన్ ఆదివారం వీల్‌చైర్‌ను అందజేశారు. రామకృష్ణ కాళ్లు చచ్చుపడిపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ముజీజ్‌ఖాన్ బాధితుడి ఇంటికి వెళ్లి మరీ వీల్‌చైర్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రామయ్య, ఈశ్వరరావు, వీరభద్రరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అంతా మోసమే..

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: కూటమి పాలనలో ప్రజలకు జరిగినదంతా మోసమేనని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని 13వ డివిజన్‌లో ఆదివారం పర్యటించిన వారికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. తాము అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలు కన్నా రెండింతలు ఎక్కువ ఇస్తామని చంద్రబాబు, పవన్‌లు చెప్పారని, ఇప్పుడు రెండు, మూడు పథకాలు అరకొరగా ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారం చేపట్టిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని అన్ని పథకాలు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 14 నెలల కాలం దాటినా ఇంతవరకు ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, అవి కూడా కొంతమందికే వస్తున్నాయన్నారు. ఒక ఏడాది గ్యాస్ సిలిండర్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని మొదట్లో చెప్పి ఇప్పుడు కేవలం రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారని, ఆ డబ్బులు కూడా చాలామంది ఖాతాల్లో జమ కాలేదని తల్లులే చెబుతున్నారన్నారు. డబ్బులు పడిన వారిలో కూడా తేడాలున్నాయని, ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పడ్డాయన్నారు. ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.8 వేలు ఇలా పడ్డాయన్నారు.

మిగతావి ఎప్పుడిస్తారు?

అన్నదాత సుఖీభవ పథకంలోనూ మోసమే చేశారన్నారు. చాలా మంది అర్హులకు ఇంకా డబ్బులు పడలేదన్నారు. ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా అమలు సాధ్యంకాని హామీలెన్నో ఇచ్చారని, అవన్నీ ఎక్కడ అమలు చేశారని నిలదీశారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్, నిరుద్యోగ భృతి వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, ప్రజలను మోసం చేయాలని చూస్తే ఊరుకోబోమని, ప్రజల తరపున వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ ఇసరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రెడ్‌బుక్'తో రాష్ట్రంలో అశాంతి..

కూటమి ప్రభుత్వం సాగిస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగ పాలనతో రాష్ట్రంలో అశాంతి వాతావరణం నెలకొందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణులు విమర్శించారు. నగరంలోని 4, 19 డివిజన్‌లలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వారు..ఇంటింటికీ వెళ్లి మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో క్షుణ్ణంగా తెలిపారు. అలాగే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమం, అభివృద్ధిని విస్మరించిందని, హామీల అమలుపై ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ అక్రమ కేసులు, అరెస్ట్‌లు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కూటమి పాలన అంతా అశాంతి, అరాచకం, అక్రమాలు, అవినీతి మయంగా మారిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమిని నమ్మి ఓట్లేసిన జనమంతా హామీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మాత్రమే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, హామీలు అమలు జరిగేలా పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, పొట్నూరు శ్రీనివాసరావు, నాయకులు అవనాపు లక్ష్మణరావు, పిన్నింటి సూర్యనారాయణ, దువ్వ శ్రీను, పొట్నూరు కేశవరావు, కోరాడ జయరాం, లంక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్మార్ట్‌మీటర్లు వద్దు.. పాతమీటర్లు ముద్దు



కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల రద్దును డిమాండ్ చేస్తూ విజయనగరంలోని గురజాడ నగర్‌లో ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ అధ్యక్షతన ప్రజావేదిక ఆదివారం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇవే స్మార్ట్ మీటర్లు వద్దన్న చంద్రబాబు, లోకేష్‌లే వాటి ఏర్పాటును ప్రోత్సహిస్తుండడం దుర్మార్గమన్నారు. 14 నెలల కూటమి పాలనలో సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరిట రూ.18,600 కోట్ల విద్యుత్ భారం ప్రజలపై పడిందన్నారు. ఇప్పుడు మరోసారి రూ.1200 కోట్ల భారం వేసేందుకు కూటమి సిద్ధమవుతోందన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అందరూ వ్యతిరేకించాలని, ఈ నెల 5వ తేదీన స్మార్ట్‌మీటర్లు వద్దు..పాతమీటర్లు ముద్దు అనే నినాదంతో చేపట్టే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

–విజయనగరం గంటస్తంభం

సన్మానం

విజయనగరం: పేద బ్రాహ్మణులకు తోడ్పాటునందించడానికి బ్రాహ్మణ సంక్షేమ వేదిక నిరంతరం కృషి చేస్తోందని బ్రాహ్మణ సంక్షేమ వేదిక శ్రీకాకుళం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణిబాబు అన్నారు. విజయనగరంలోని సోమస్కందా పీఠంలో జరిగిన బ్రాహ్మణా సంక్షేమ వేదిక కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేదిక నిర్వహిస్తున్న వేడుకలన్నీ అద్భుతంగా ఉన్నాయన్నారు. సమాఖ్య అందజేసే సంక్షేమ పథకాలను బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాయింట్ సెక్రటరీ నేర్ల మల్లిఖార్జున మాట్లాడుతూ అన్ని సంఘాల్లోని బ్రాహ్మణులందరికీ తమ వేదిక పథకాలను ఉచితంగా అందిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ కార్యక్రమాలను విస్తరిస్తామన్నారు. అనంతరం 50 మంది వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బోడవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పతివాడ అప్పారావుకు వైఎస్సార్ సీపీ నాయకుల నివాళి





అప్పారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, నెల్లిమర్ల జ్యూట్ మిల్లు శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు పతివాడ అప్పారావు శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం జరగ్గా జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడులు అప్పారావు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను జెడ్పీ చైర్మన్ కొనియాడారు. పార్టీ అభ్యున్నతికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి అప్పారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మత్స సత్యనారాయణ, పతివాడ సత్యనారాయణ, సముద్రపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: శ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ జ్యూట్‌మిల్లు కార్మికుడు పతివాడ అప్పారావు మృతికి నివాళులర్పిస్తూ స్థానిక జ్యూట్‌మిల్లు గేటు వద్ద సంతాప సభ ఆదివారం నిర్వహించారు. జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం కృషి చేసిన వారిలో అప్పారావు ప్రథములని, ఆయన కార్మికుల పక్షాన నిలిచి చేసిన పోరాటాలు ప్రశంసనీయమన్నారు.

'ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ' అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా లెంక శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక పట్టణంలోని కేఎల్ పురం యూత్ హాస్టల్‌లో ఆ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు, కోశాధికారిగా కె.గౌరీశంకర్, ఉపాధ్యక్షులుగా ఎస్.అశోక్‌కుమార్, ఎం.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీగా పి.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా దారపురెడ్డి త్రినాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ధనరాజ్, మీడియా కో–ఆర్డినేటర్ పి.సూర్యరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి.భానుమూర్తి, వై.శ్రీధర్, పి.సన్యాసిరావు, జి.శారద, బి.కుసుమలు ఎన్నికయ్యారు.



కొత్త కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

ఎరువుల డీలర్‌కు నోటీసులు

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండల కేంద్రంలోని శ్రీబాలాజీ స్టోర్స్(ఎరువుల షాపు)కు నోటీసులు ఇచ్చినట్లు ఆ మండల ఏవో బి.శ్యామ్‌కుమార్ ఆదివారం సాయంత్రం తెలిపారు. ఆ స్టోర్‌లోని ఎరువుల డీలర్.. గుళికలు కొంటేనే యూరియా ఇస్తానని రైతులకు చెప్పి, యూరియా బస్తాతో పాటు గుళికలు కూడా కొనుగోలు చేసేలా ఒత్తిడి చేశాడు. దీనిపై ఇటీవల సాక్షి దినపత్రికలో గుళికలు కొనుగోలు చేస్తేనే యూరియా శీర్షిక పేరిట వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఆ స్టోర్ నిర్వాహకులను హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. బాధిత రైతును విచారించిన తర్వాత ఆ దుకాణానికి స్టాప్ సేల్స్ ఆర్డర్స్ ఇస్తామని ఏవో చెప్పారు.

జంధ్యాల పంపిణీ

విజయనగరం టౌన్: స్థానిక కోట జంక్షన్ వద్ద బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య వారు ఉచితంగా జంధ్యాలు పంపిణీ చేశారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నగరంలో జంధ్యాలు వేసుకునే దాదాపు 5 వేల మందికి జంధ్యాలు అందజేసినట్లు సమాఖ్య అధ్యక్షుడు పూడిపెద్ది రమణమూర్తి తెలిపారు. 15 ఏళ్లుగా ఈ కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నామన్నారు.

మిగులు సీట్ల భర్తీకి చర్యలు

చీపురుపల్లి: బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణీశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. చీపురుపల్లిలోని గురుకుల కళాశాల/పాఠశాలలో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే గురుకులంలో ఐఐటీ, నీట్‌కు సంబంధించిన క్యాంపస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విభాగంలో 16 సీట్లు, నీట్ విభాగంలో 16 సీట్లు ఖాళీలున్నట్లు తెలిపారు. ఈ సీట్లను ఎస్సీ విద్యార్థినులతోనే భర్తీ చేస్తామన్నారు. అలాగే పాఠశాలకు సంబంధించి పదో తరగతిలో మూడు సీట్లు, ఐదో తరగతిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఆధార్, రేషన్‌కార్డు, ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 83093 61345 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి..




పైడితల్లి, ఇందిర దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

విజయనగరం అర్బన్: ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన ఉత్తమ సేవలే మంచి గుర్తింపునిస్తాయని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జొన్నవలస జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు చుక్కల పైడితల్లి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, పైడితల్లి సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయుడిగా బోధనా రంగంతో పాటు ఉపాధ్యాయ సంఘ సేవలోనూ పైడితల్లి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పైడితల్లి, ఇందిర దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.వి జయలక్ష్మి, ఎంఈవోలు టి.లలితకుమారి, పి.సత్యవతి, ఆర్.కృష్ణ, జె.త్రినాధరావు, పి.లక్ష్మణదొర, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రెడ్డి గణపతి తదితరులు పాల్గొన్నారు.

భూలోకమ్మకు ప్రత్యేక పూజలు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో భూలోకమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖరీఫ్ వరినాట్లు పూర్తి కాగానే ప్రతి ఏడాదీ అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుంటామని గ్రామపెద్దలు తెలిపారు. పంటలు బాగా పండాలని.. పశువులు ఆరోగ్యంగా ఉండాలని మొక్కుతూ అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ వరలక్ష్మీకనకరాజు, ధనుంజయ్, తదితరులు ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

• దేశసేవలో సంతృప్తి

- మాజీ సైనికుడు ధనుంజయరావు



ధనుంజయరావును సత్కరిస్తున్న సైనిక సంఘ సభ్యులు, గ్రామపెద్దలు

జామి: దేశానికి సేవ చేయడం వల్ల ఎంతో సంతృప్తి కలిగిందని మాజీ సైనికుడు పొన్నగంటి ధనుంజయరావు అన్నారు. ఇండియన్ నేవీలో సర్వీస్ పూర్తి చేసుకుని స్వగ్రామమైన అన్నంరాజుపేట చేరుకున్న ధనుంజయరావున గ్రామపెద్దలు, అన్నంరాజుపేట సైనిక సంక్షేమ సంఘ సభ్యులు శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ.. యువత దేశసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ధనుంజయరావుతో పాటు తల్లిదండ్రులు సూరిబాబు, సావిత్రిలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్లపూడి ఫణి బంగార్రాజు, సైనిక సంక్షేమ సంఘ సభ్యులు రొక్కం రవి, మురుముళ్ల బంగారుకృష్ణ, పోతల సంతోష్, గుండాల సాయి, దేవా సత్యనారాయణ, కొండపల్లి ఎర్రిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల చరిత్ర తెలుసుకోవాలి

శృంగవరపుకోట: నేటి యువత స్వతంత్ర సమరయోధుల చరిత్ర తెలుసుకోవాలని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు సూర్యారావు పిలుపునిచ్చారు. వేదిక వార్షికోత్సవం స్వాతంత్ర్య దినోత్సవం రోజున నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం జరిగిన వేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కళాశాల విద్యార్థులకు 'స్వాతంత్ర్య ఫలం – జాతీయ నాయకుల పాత్ర' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు ఎం.అప్పారావు, దుర్గాప్రసాద్, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు సూర్యారావు

పుస్తకాల పంపిణీ



ధర్మవరంలో చిల్డ్రన్‌హోమ్‌లో అనాథ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: పలువురు అనాథ చిన్నారులకు ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి రూ. ఐదు వేల విలువైన పుస్తకాలను ఆదివారం అందజేశారు. మండలంలోని ధర్మవరం గ్రామంలోని ఈఎఫ్ఎం చిల్డ్రన్ హోమ్‌లో ఉన్న అనాథ పిల్లలకు పుస్తకాలు అవసరమన్న విషయం తెలుసుకున్న సీఐ పుస్తకాలు కొనుగోలు చేసి అదే గ్రామానికి చెందిన అల్లు కిట్టబాబుతో హోమ్‌కు పంపించారు. కార్యక్రమంలో వి.శ్రీను, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామ సమీపంలో జూదమాడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితుల నుంచి రూ.15,120 నగదు స్వాధీనం చేసినట్లు చెప్పారు.